క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నార్నూర్: ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురుకులంలో ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ కోసం పదో తరగతి విద్యార్థులు 5వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ శుక్రవారం తెలిపారు. సెంట్రల్, స్టేట్ సిలబస్ అనే తేడా లేకుండా ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, లైబ్రరీ, ల్యాబ్, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీవోకు సన్మానం



సన్మానిస్తున్న పంచాయతీ కార్మికులు

నేరడిగొండ: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా నేరడిగొండ ఎంపీవోగా లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయనను కలిసి ఘనంగా సత్కరించారు. ప్రతిఒక్కరూ తమ విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

నర్సింగ్ ఆఫీసర్‌గా గృహిణి



నియామక పత్రం అందుకుంటున్న సంగీత

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన గృహిణి వి. సంగీత నర్సింగ్ ఉద్యోగ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 105, జోనల్ స్థాయిలో 13వ ర్యాంకు సాధించి ఉద్యోగం పొందారు. దీంతో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. భర్త బాలాజీ ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

ఇచ్చోడ: మండలంలోని కామాగిరికి చెందిన నక్కల నారాయణ రెడ్డి ఎద్దు శుక్రవారం విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. వ్యవసాయ భూమిలో ఎద్దు గడ్డి మేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సూమారు రూ. 70 వేల వరకు ఉంటుందని రైతు వాపోయారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడు కాశీం మృతి

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు షేక్ కాశీం (57) అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొంత కాలంగా లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి భార్య షరీఫా బేగం నిపాని గ్రామ సర్పంచ్‌గా చేసింది. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సమ్మె నోటీస్

ఖానాపూర్: ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెను పురస్కరించుకుని మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో మధుసూదన్‌కు శుక్రవారం సమ్మె నోటీస్ అందజేశారు. కార్మికులకు కనీస వేతనంతోపాటు ఇతర డిమాండ్ల సాధనలో భాగంగా సమ్మెలో పాల్గొంటామని వివరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు రాధ, లక్ష్మి, ఆసియాబాను, బుచ్చవ్వ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లో గతనెల 28న ప్రారంభమైన మస్కాపూర్ ప్రీమియర్ లీగ్ సీజన్‌-1 క్రికెట్ టోర్నీ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో విజేతగా సన్‌రైజర్స్ జట్టు, రన్నరప్‌గా మస్కాపూర్ వారియర్స్ నిలిచారని నిర్వాహకులు తెలిపారు. విజేతకు రూ.10 వేలు, రన్నరప్‌కు రూ.5వేల నగదు అందజేశారు. మహేందర్, సాగర్, మాజిద్, గజేందర్, రాజిరెడ్డి, నర్సయ్య, సన్ని, రాజేందర్, శరత్, అఫ్జల్, ఆసిఫ్, వెంకటేశ్, సాయి, గంగాధర్ ఉన్నారు.

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

ఖానాపూర్: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దిగంబర్ కోరారు. పట్టణంలోని బీసీ హాస్టల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకపోతే ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం ఖానాపూర్ హాస్టల్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

‘ప్రత్యేక’ పాలన ప్రారంభం

- ముగిసిన సర్పంచుల పదవీకాలం
- బాధ్యతలు చేపట్టిన అధికారులు



తాంసి: గిరిగాం గ్రామ పంచాయతీ కార్యాలయం

తాంసి: గ్రామాల సర్పంచుల పదవీ ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తాంసి(బి)కి ఎంపీడీవో భూమయ్య, బండల్‌నాగాపూర్, గోట్కూరి, సావర్గాంకు తహసీల్దార్ లక్ష్మి, గిరిగాం, లీమ్‌గూడకు పశువైద్యాధికారి రజనీకాంత్, అంబుగాంకు సూపరింటెండెంట్ రవీందర్, పాలోది, జామిడి, కప్పర్లకు పంచాయతీ అధికారి స్వప్నశీల, భీంపూర్ మండలంలోని అందర్‌బంద్, జల్‌కోరికి సూపరింటెండెంట్ రాంమోహన్, భీంపూర్, బెల్సరీరాంపూర్, మార్కగూడ, కైరిగూడకు ఎంపీడీవో శ్రీనివాస్, అంతర్గాం, భగవాన్‌పూర్, అర్లి(టి), ఇందూర్‌పల్లికి తహసీల్దార్ హరిదాస్, కమట్‌వాడ, ధనోర, గోన, గుంజాల, వడూర్‌కు పశువైద్యాధికారి సుభాష్‌రాథోడ్, గబిడి, టెక్డిరాంపూర్, కరన్‌వాడీ, గోముత్రికి పశువైద్యాధికారి గజానన్, నిపాని, పిప్పల్‌కోటి, తాంసి(కె), వడ్గాం, గుబిడిపల్లి, గొల్లఘాట్‌కు పంచాయతీ అధికారి అహ్మద్‌ఖాన్, కరంజి(టి)కి ఎంఈవో శ్రీకాంత్‌లను ప్రభుత్వం నియమించింది.

సిరికొండ: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పల్లెల్లో ప్రత్యేక పాలన ప్రారంభమైంది. మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు సిరికొండ, కొండపూర్, సుంకిడి, సోన్‌పెల్లి, పోన్న, రాయిగూడలకు ఎంపీడీవో సురేశ్, ధర్మసాగర్, జెండాగూడ, కుంటగూడ, నారాయణ పూర్, నేరడిగోండి(జి), పోచంపల్లి, రిమ్మలకు ఏపీవో ఏ.సంతోష్, ఫకీర్ నాయక్ తండా, లచ్చిపూర్ (బి), రాంపూర్(బి), వాయిపేట్‌లకు డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, కన్నాపూర్, మాల్లపూర్ గ్రామ పంచాయతీలకు తహసీల్దార్ విజయ్ కుమార్లను నియమించారు.

తలమడుగు: గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక పాలన ప్రారంభమైంది. 28 గ్రామ పంచాయతీలకు ఏడుగురు అధికారులను ప్రభుత్వం నియమించింది. తహసీల్దార్ రాజమోహన్‌కు అర్లి(కె), రుయ్యాడి, లచ్చంపూర్, సకినపుర్, ఎంపీడీవో రమాకాంత్‌కు తలమడుగు, కొత్తూరు, దొర్లి గ్రామాలు, అగ్రికల్చర్ ఏవో మహేందర్‌కు దేవాపూర్, కజర్ల, మండల పశువైద్యాధికారి దూదిరామ్ రాథోడ్‌కు కొడథ్, ఉండం, సుంకిడి, పీఆర్ఈ మజార్‌కు చర్లపల్లి, రత్నాపూర్, కప్పర్‌దేవి, ఎంపీవో వినోద్‌కు కోసాయి, మహేష్‌కు లచ్చంపూర్, లింగీ, పల్సి(బి), లక్ష్మీంపూర్, పల్సి(కె), జమీల్‌కు నందిగామ కేటాయించారు.

ఇచ్చోడ: గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ.. జిల్లా కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం పలువురు అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఇచ్చోడ, కామాగిరి, బోరిగామ గ్రామాలకు ఎంపీడీవో రాంప్రసాద్, సాథ్‌నంబర్, కోకస్‌మన్నూర్ పంచాయతీలకు తహసీల్దార్ తుకారాం, అడేగామ(కె), అడేగామ(బి), దుబార్‌పేట్ పంచాయతీలకు ఎంపీవో సాయిప్రసాద్, బావోజిపెట్, గుండాల, కేశవపట్నం, సిరిచెల్మ పంచాయతీలకు డిప్యూటీ త హసీల్దార్ జాదవ్ రామారావును, దేవుల్‌నాయక్‌తండా, ముఖరా(కె), ముఖరా(బి)లకు వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్, దాబా(బి), దాబా(కె), హీరపూర్, తలమద్రి పంచాయతీలకు పశువైద్యాధికారి గోవింద్‌నాయక్, ధర్మంపూరి, గేర్జం పంచాయతీలకు పంచాయతీ రాజ్ ఏఈ అభినవ్, గుండివాగు, మల్యాల, మాన్కపూర్, నవేగావ్, సల్యాదలకు ఏఈఈ వెంకటేశ్, జల్దా, జామిడి, జున్ని పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూ ఏఈ జైపాల్, మాదపూర్ పంచాయతీకి ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ పుష్పా, నర్సపూర్ పంచాయతీకి ఎంఈవో ఉదయ్‌రావులను ప్రభుత్వం నియమించింది. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని అధికారులు అన్నారు.

ఇంద్రవెల్లికి తరలిన నాయకులు



జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న రమేశ్‌రెడ్డి



సభకు వెళ్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. రాంలీలా మైదానం వద్ద సభ ఇన్‌చార్జి పటేల్ రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి ఇంద్రవెల్లి సభకు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున శుక్రవారం తరలివెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యే సభకు తాంసి, కప్పర్ల, బండల్ నాగాపూర్, వడ్డాడి, పొన్నారి, గిరిగాం గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు రామన్న యాదవ్, అభిలాష్ రెడ్డి, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున ఇంద్రవెల్లిలో నిర్వహించిన కాంగ్రెస్ పునర్నిర్మాణ సభకు ప్రత్యేక వాహనాల్లో శుక్రవారం నాయకులు తరలివెళ్లారు. మండల కన్వీనర్ ఆడె వసంత్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న ఎంపీ ఎన్నికల కోసం కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని దర్శించుకొని ప్రచారం ప్రారంభించడం జరుగుతుందన్నారు. సభకు తరలివెళ్లిన వారిలో అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, అనుపట్ల సంజీవ్ కుమార్, రాంలక్ష్మణ గౌడ్, గడ్డం నరేశ్, పాల శంకర్, నాయిడి రవి, బొలిశెట్టి రాములు, బుక రాములు, ధర్మదాస్ మహేందర్ ఉన్నారు.

గిరిజన గూడేల్లో సౌకర్యాలు కరువు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- నీటిమూటలుగానే నేతల హామీలు



అధ్వానంగా బుర్సిగుట్ట రోడ్డు

సిరికొండ: ప్రస్తుతం సాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. కానీ గిరిజన గూడేలు మాత్రం ఇంకా అభివృద్ధికి దూరంగానే ఉన్నాయి. కనీస సౌకర్యాలు లేక ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మనం ఒక్క నిమిషం కరెంటు లేకపోతేనే తట్టుకోలేం. వారికి కరెంట్ అంటే తెలియని పరిస్థితి. మండలంలోని కొలాం గూడేలైనా బుర్సిగుట్ట, ధర్మన్నపేట్‌కు కరెంటు సౌకర్యం లేక చీకట్లోనే కాలం వెల్లదీస్తున్నారు. అప్పటి ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ వారు సోలార్‌ను ఏర్పాటు చేసి విద్యుత్‌ను అందించారు. అవి వివిధ కారణాలతో గత కొద్ది సంవత్సరాలుగా పని చేయడం లేదు. దీంతో గిరిజనులకు తిప్పలు తప్పడం లేదు.

ఆధ్వాన రోడ్లు..

మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో 5 కోలాం గిరిజన గ్రామాలు ఉన్నాయి. ధర్మన్నపేట్, లెండీగూడ, కోలాంగూడ, బుర్సిగుట్ట, ముత్యంపేట్ గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రజలు ఉండేందుకు సరైన ఇల్లుకూడా లేదు. ముత్యంపేట్ మినహాయించి మిగతా గూడేలకు సరైన రోడ్డు లేదు. నీటి వసతి లేక దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ చెలిమ నీటినే తాగుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం లేక పోవడంతో పిల్లలకు పౌష్టికాహారానికి దూరం అవుతున్నారు. ఇతర గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరెంటు సౌకర్యం కల్పించాలి

ధర్మన్నపేట్‌కు కరెంటు లేదు. మేము చీకట్లోనే జీవిస్తున్నాం. గ్రామంలో 10 కుటుంబాలు ఉన్నా యి. వ్యవసాయ భూములు ఇక్కడే ఉండడంతో కాలం వెల్లదీస్తున్నాం. ప్రభుత్వం వెంటనే రోడ్డు, కరెంట్ సౌకర్యం కల్పించాలి.

– సిడాం గంగుబాయి, ధర్మన్నపేట్

భగీరథ నీళ్లు రావు



మా గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడం లేదు. వచ్చినప్పుడు వస్తాయ్.. లేదంటే రెండు, మూడు రోజులుకు ఒకసారి వస్తాయి. దీంతో చాలా దూరం నడిచి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి భగీరథ నీటిని సరఫరా చేయాలి.

– తొడసం జంగుబాయి, బుర్సిగుట్ట

వన భోజనానికి విద్యార్థులు

బేల: మండలంలోని మశాల(బి) గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం మశాల(కె) అటవీ ప్రాంతానికి వన భోజనానికి వెళ్లారు. విద్యార్థులు ఆటలు ఆడుతూ.. ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మహేష్, ఉపాధ్యాయులు నరేశ్‌కుమార్, సంతోష్, సకారం, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

‘బొజ్జు’ ఫొటో లేదని బ్యానర్ చింపివేత



కార్యకర్తలు చింపిన బ్యానర్

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్ కారణంగా వివాదం నెలకొంది. కాంగ్రెస్ పునర్నిర్మాణ సభలో భాగంగా శుక్రవారం మంచిర్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ఏర్పాటు చేసిన స్వాగతం బ్యానర్‌పై ఖానాపూర్ ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు చింపివేశారు. స్థానిక ఎమ్మెల్యే ఫొటో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఆదివాసీలను చూలకనగా చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాపూరావు

బోథ్: ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలబోరి గ్రామంలో అఖండ హరినామ సప్తహ కార్యక్రమానికి హాజరయ్యారు. భక్తి భావనతో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతలబోరి గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

‘పేదలకు అండగా బీఆర్ఎస్’



మాట్లాడుతున్న జోగు రామన్న

కైలాస్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ భవాని గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 9 నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చి పార్లమెంట్ స్థానాలు గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు వస్తాయని వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అందే వరకు ప్రజలకు అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ ఉనికిని చాటే అవసరం ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ స్థానాల గెలుపే లక్ష్యంగా కమిటీలు పని చేయాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ బెదిరింపులు, ప్రలోభాలకు కార్యకర్తలు భయపడవద్దన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు సలీం, రమేశ్, మమత, కౌన్సిలర్లు నర్సింగ్, భూమన్న, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా కోఆర్డినేటర్

ఎదులాపురం: మహిళ సాధికారత, సఖీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం బంగారిగూడ జన శిక్షణ సంస్థాన్ సెంటర్‌లో మహిళలకు మహిళా చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్ యశోద మహిళలకు బేటీ బచావో.. బేటీ పడావో, మిషన్ శక్తి, సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, లింగ నిర్ధారణ నిషేధ చట్టం, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, మహిళహక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం నిర్వహకురాలు సరస్వతి, ట్రైనర్ మమత, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అన్నిరంగాల్లో ప్రగతి



మాట్లాడుతున్న కృష్ణవేణి

ఆదిలాబాద్‌రూరల్: విద్యతోనే ఆడపిల్లలు అన్నిరంగాలలో ప్రగతి సాధించగలరని స్త్రీ శిశు సంక్షేమ మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్టు కృష్ణవేణి అన్నారు. శుక్రవారం మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్ శక్తి, బాల్యవివాహాలు, పోక్సోయాక్ట్, హెల్ప్ లైన్ నెంబర్స్, లింగ వివక్ష, సమానత్వం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిల్, పాఠశాల ఉపాధ్యాయులు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం హర్షణీయం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామనడం హర్షణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సీఎం సభలో భాగంగా ముందుగా అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. నాగోబా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని అనడం సంతోషకరమన్నారు. మతోన్మాద ప్రభుత్వాన్ని తరిమికొట్టి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలు, యువతపైన ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాంసి: విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం కలగనున్నట్లు తాంసి ఏఈ మనోజ్ కుమార్ తెలిపారు. రాంపూర్ సబ్‌స్టేషన్ సమీపంలోని 33 కేవీ మరమ్మత్తుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆదిలాబాద్‌లోని రాంపూర్, పొన్నారి, తాంసి, తలమడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ఇచ్చోడకు ఎమ్మెల్యే రాక

ఇచ్చోడ: మండల కేంద్రానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం రానున్నట్లు తహసీల్దార్ తుకారాం శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబరాక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నారు.

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీటీసీ అంబేకర్ పండరిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో క్రికెట్ పోటీలను ప్రారంభించడంతో పాటు ఆలయాలను దర్శించుకోనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఏఐటీయూసీ సమావేశం

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ మండల కార్యదర్శి కళ్లెపెల్లి గంగయ్య తెలిపారు. శుక్రవారం ఇచ్చోడలో నిర్వహించిన విలేకరుల సమావేశలో మాట్లాడారు. సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ కార్మిక అనుబంధ సంఘాలు నాయకులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాలాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



తాంసి: సర్పంచ్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ రాజు



బోథ్: జీపీ కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

తాంసి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించారని జెడ్పీటీసీ రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్నారి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌తో పాటు పాలకవర్గసభ్యులను ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌గా ఐదేళ్ల పాటు సేవలు అందించిన అశోక్‌తో పాటు వార్డుసభ్యులు తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేఖ రఘు, ఎంపీవో స్వప్నశీల, పంచాయతీ కార్యదర్శి విజజ్, గ్రామపెద్దలు రమణ, ఆనంద్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే హస్నాపూర్ సర్పంచ్ అలాలి జ్యోతి నర్సింగ్ దంపతులకు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. గత ఐదేళ్లుగా గ్రామాభివృద్ధికి సర్పంచ్ విశేషంగా కృషి చేశారని, సమస్యలు సైతం తమ వంతుగా పరిష్కారించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సభ్యులు స్వామి, రమేశ్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: సొనాల గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్య కార్మికులను మాజీ సర్పంచ్ సదానందం, మాజీ వార్డు సభ్యులు శాలువాతో సత్కరించారు. ఐదు సంవత్సరాల పాటు పాలకవర్గానికి పూర్తి స్థాయిలో సహకారాలు అందించారని అన్నారు. పారిశుద్య కార్మికుల వల్లే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచామన్నారు.

బోథ్ మండలంలోని దేవుల్ నాయక్‌తండాలో పాలకవర్గాన్ని గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదలు తెలిపారు.

నార్నూర్: మాన్కాపూర్ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్స్‌ని గ్రామస్తులు, యూత్ నాయకులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ రాథోడ్ సావిందర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటానన్నారు. డిజిటల్ పార్క్, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మిణం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ మెస్రం రూపుదేవ్, పంచాయతీ కార్యదర్శి లవ్ కుమార్, ఉప సర్పంచ్ రూపుదేవ్, వార్డు సభ్యులు శనిగరపు నారాయణ, జూగనక కళావతి, రాథోడ్ శాంతాబాయి, మెస్రం భీంబాయి పాల్గొన్నారు.